# కథ

## ఎడారి సత్రం



– గోపరాజు రాధాకృష్ణ

<u>నేను ఎలాంటి ఉద్యోగం అయితే కావాలను కున్నానో, ఎలాంటి ఉద్యోగం కోసం అహర్నిశలూ పాటుపడ్డానో ఆ ఉద్యోగమే దొరికింది. గవర్నమెంటుదే.</u>

జీవితంలో సెటిల్ అయ్యాను. నా రచనా వ్యాసంగం తిరిగి ఆరంభించాను. అంతకుముందు... అంటే గ్రాడ్యుయేషన్‌లో వుండగా ఒక్కో కథ అడపా దడపా రాస్తూండేవాడిని. పెంపుడు చిలకలకన్నా విశ్వాసంతో గోడకి కొట్టిన బంతి కన్నా వేగంగా తిరిగి క్షేమంగా వచ్చేసేవి. 'సాహిత్య సృష్టికి నేను పనికి రాను' అని తీర్మానించుకుని, నైరాశ్యం లోంచి పుట్టిన వైరాగ్యంతో, రచన్లు విరమించుకున్నాను.

మళ్ళీ ఇపుడు ఉద్యోగంలో చేరిన తర్వాత 'రచన్లు నేను మాత్రం ఎందుకు చెయ్యకూడదు?' అనిపించి, రచన్ల మీద అభిలాష తీవ్ర రూపం దాల్చింది. ఏ సమస్యలూ లేవు కనుక నిరాటంకంగా, నిరంతరాయంగా రాయడం మొదలు పెట్టాను. రాయగా రాయగా అలవాటైంది. 'పెంపుడు చిలకల సంఖ్య' క్రమానా తగ్గుముఖం పట్టింది.

* * * *

నిజానికి రచన ప్రచురించబడినపుడు కంటే ఆ రచన గురించి వచ్చే రెస్పాన్సు రచయితలకి ఎక్కువ ఆనందాన్నిస్తుంది. రచనని సాంతం చదివి, దాని బాగోగుల్ని నిర్మొహమాటంగా, సహేతుకంగా వర్ణించే ఉత్తరాలైతే సదరు రచయితకి మరీ సంతోషం!

కథని ప్రచురించినపుడు, దానితో బాటే రచయిత ఫోటో, చిరునామా ప్రచురించడం 'గీతిక' వారపత్రిక ఆనవాయితీ. ఆ పత్రికలో నా రచన, వివరాలూ వచ్చాయి. ప్రస్తుతం నేనున్న రూమ్ త్వరలోనే మారిపోదామనే ఉద్దేశం వుండడంతో రచనతో బాటు ప్రచురణకి ఆఫీస్ ఎడ్రస్ ఇచ్చాను. ఆ కథ పేరు 'స్వయంకృతం'.

* * * *

'స్వయంకృతం' కథ మొదలుకొని, నా కథ ఏ పత్రికలో ప్రచురించబడినా 'కథ బావుంది' అంటూ ఉత్తరం రాయడం మొదలు పెట్టాడ ఎవరోతిరుమల రావు అనే వ్యక్తి. ఏ కథ బావుందని మాత్రం ఎన్నడూ రాయలేదు. రచన చదువుతాడో లేదో గానీ అన్నీ చూడడం మాత్రం చూస్తాడు. తిరుమలరావు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చినపుడల్లా 'థాంక్స్' చెబుతూ నేను కూడా ఉత్తరం రాయడం మొదలు పెట్టాను.

ఏ వారమైనా నా కథ ఏ దిన, వార పత్రికలోనూ కనిపించకపోతే 'ఈ మధ్య మీరు కథలు రాయడం లేదు' అనో, 'మీ లాంటి వర్ధమాన రచయితలు బద్ధకాన్ని దూరంగా తరిమి కొట్టాలి' అనో రాసేవాడు.

ఓ సెలవు రోజున కూర్చుని తిరుమలరావుకి నేనో ఉత్తరం రాశాను.

"మిత్రులు తిరుమలరావు గారికి -

నమస్కారాలు.

మీ అభిమానానికి కృతజ్ఞుడిని.

నా రచనల్ని రెగ్యులర్‌గా ఫాలో అవుతున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది.

మహతి వారపత్రికలో 'పిపాస', 'రాతి గుండెలు'; 'మానస' మాస పత్రికలో 'నిర్వేదం', 'రంజని' వీక్లీలో 'అష్టమ సముద్రం', 'పగిలిన గుండెలు' కథల్ని ప్రచురణకి అంగీకరించినట్టుగా సమాచారం వచ్చింది. వాటిని కూడా వీలైతే చదవండి.

సద్విమర్శ చేస్తే, రచయిత తన తర్వాతి రచనల్లో రెక్టిఫై చేసుకునే అవకాశం వుంటుంది.

మీ వివరాలు తెలియచెయ్యండి.

సదా మీ అభిమానాన్ని ఆశిస్తూ
కరుణాకర్"

మరో వారం రోజులకి తిరుమలరావు దగ్గర్నుంచి ఓ ఉత్తరం వచ్చింది. అవసరమనిపించినపుడు వివరాలు రాస్తాడట. అన్యథా భావించవద్దంటూ ఉత్తరం!

తిరుమమరావు దగ్గర్నుంచే కాకుండా ఇంకా ఉత్తరాలు వస్తుండేవి. వాటికి కూడా సమాధానాలిచ్చేవాడిని - 'థాంక్స్' చెప్తూ.

కొన్ని రోజులు గడిచినయ్.

ఓరోజు—

ఆఫీస్‌కి ఓ ఉత్తరం వచ్చింది. 'స్ట్రిక్ట్లీ పర్సనల్' అని రాసి వుంది కవరు మీద. అడ్రస్ రాసిన చేవ్రాతని బట్టి ఆ ఉత్తరం ఎవరి దగ్గర నుంచి వచ్చిందో కనిపెట్టడానికి ఎక్కువ టైం పట్టలేదు నాకు. అది తిరుమలరావు రాసిన ఉత్తరం.

తిరుమలరావు నన్ను కలవడానికి వస్తున్నాట్ట. హైదరాబాద్‌లో వాళ్ళ చుట్టాలింట్లో దిగి, నా రూంకి రావాలని అనుకుంటున్నాట్ట. ఏ తేదీ అయితే వీలు అవుతుందో తెలియచెయ్యమని కోరుతూ ఉత్తరం రాశాడు.

నాకు వీలైన రోజు, సమయం- ఓ ఆదివారం నాటికి ప్రోగ్రామ్ ఫిక్స్ చేసి తిరుమలరావుకి రాశాను. రూమ్‌లోనే కలవడానికి రూమ్ అడ్రస్సే ఇచ్చాను.

* * * *

ప్రచురించబడిన కథలని కలెక్ట్ చేసిన ఫైల్‌ని బయటకి తీశాను. అల్పాహారం కోసం సిద్ధం చేశాను.

తలుపు చప్పుడయింది. తెరిచాను.

ఎదురుగా అరవై వసంతాల వృద్ధుడు నిల్చొని వున్నాడు. "నా పేరు తిరుమలరావు" అన్నాడాయన. ఆశ్చర్యపోవడం నా వంతైంది. తిరుమలరావుకి అంత వయసుంటుందని నేననుకోలేదు. పాతిక, ముప్పై మధ్యుంటుందని ఊహించాను.

ఆశ్చర్యాన్ని తుడిచేసి, చిర్నవ్వుని ముఖానికి పులుముకుని "నమస్తే" అని లోపలికి ఆహ్వానించాను. సీలింగ్ ఫాన్ వేసి కూర్చోబెట్టాను. రస్న కలిపాను. చెరొకటి తీసుకున్నాం. నా రూమ్ కనుక్కోవడం కష్టమైందిట. భుజమ్మీది కండువాతో తుడుచుకుంటూ చెప్పారాయన.

జీవితాన్ని కాచి వడబోసిన పెద్ద వయసు వ్యక్తి నా అభిమాని కావడం ఆనందం అనిపించింది. జీవితపు విలువల్ని, లోతుల్ని నా కథలో ప్రతిబింబింప చేస్తుండడాన్ని ఆయన మెచ్చుకున్నారు.

"రాతి గుండెలు, నిర్వేదం కథలు ఈ వారం వచ్చాయి. ఎలాగూ కలుస్తానని ఉత్తరం రాయలేదు" అని పక్కనున్న ఖద్దరు సంచిలోంచి ఓ కాగితం తీసి నాకిచ్చారు తిరుమలరావు గారు. ఆయన చెప్పారు "నేనో రిటైరైన టీచర్ని బాబూ. నాలుగు నెలలుగా నాకు పెన్షన్ నిలిచిపోయింది. ఆఫీస్‌లో అడిగితే మీరే ఆ ఫైల్ చూస్తారని తెలిసింది. ఈ దీనుడి గుండె కోతని అర్థం చేస్కోండి బాబూ. మేం అయిదుగురం. ఈ పెన్షన్ తప్ప మాకు ఏ ఆధారం లేదు. ఆ పెన్షను సాంక్షనయ్యేలా చూడండి" అని రెండు చేతులూ జోడించారు.

నా గుండె చెరువయింది. లేచి వెళ్ళిపోతున్న ఆయన్ని అలా చూస్తుండిపోయాను.